

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-మోతుగూడెం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అగౌరవపరిచే విధంగా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. చింతూరు మండలం, మోతుగూడెం సిపిఎం శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి కేంద్ర హోంమంత్రిగా ఉండటం దేశ ప్రజలు దురదృష్టకరమన్నారు. కార్మిక, కర్షక, పేద, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు, మహిళలకు హక్కులు కల్పించిన డాక్టర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం యావత్ భారతావానికి తీరని అవమానమన్నారు. అమిత్ షాను ప్రధాని మోడీ సమర్ధించడం దుర్మార్గమన్నారు. మతాలు, కులాల పేరుతో ప్రజల్లో విభజన తీసుకొచ్చి భారతదేశాన్ని వెనక్కి తీసుకువెళ్లే ప్రయత్నంలో బిజెపి ప్రభుత్వం ఉందని, ప్రజలందరూ ఏకమై బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు బివి రమణ పాల్గొన్నారు.

ముసురు పట్టిన మన్యం

- వర్షాలతో చిరు ధాన్యాలు, అపరాల పంటలకు తీవ్ర నష్టం
- గెడ్డలు ఉప్పొంగడంతో పలుచోట్ల రాకపోకలకు ఇక్కట్లు

ప్రజాశక్తి- హుకుంపేట : అల్పపీడన ప్రభావంతో మన్యంలో ముసురుపట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుకుంపేట మండలం చీడిపుట్టు వద్ద కల్వర్టుపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరికోతలు, రాజ్‌మా, చిక్కుడు, కాఫీ పండ్లు సేకరణ ఇతర పనులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జోరుగా కురుస్తున్నా వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో రైతులు పంటలు సేకరించడానికి కొంత అంటకం ఏర్పడింది.

డుంబ్రిగుడ : బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా ముసురు పట్టుకోగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో మండలంలోని అరకు వారపు సంతలో వివిధ రకాల అటవీ ఉత్పత్తులు విక్రయించేందుకు వచ్చిన రైతులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. పర్యాటకులతో కిటకిటలాడే ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం శుక్రవారం వర్షం కారణంగా బోసిపోయింది. అరకు వర్షంతో కొచ్చిన గిరిజనులు వర్షం కారణంగా తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. చల్లటి గాలులు వీయడంతో చలి తీవ్రత అధికమైంది. దీంతో పాఠశాలకు వెళ్లి వచ్చే విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా కూలి పనులకు వెళ్లే దినసరి కూలీలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏపీ జెన్కో ఉద్యోగులు విధులకు హాజరుకావడానికి కాస్త ఇబ్బందులు పడ్డారు.



చీడిపుట్టు వద్ద కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న కొండవాగు



సీలేరులో తడిసి బూజు పట్టిన మినప చేను

చిరు ధాన్యాలు, అపరాల పంటలకు నష్టం



టార్పాలిన్లతో కప్పి ఉంచిన అపరాల పంట చేను

సీలేరు: తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు జీకే.వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ, గాలికొండ, గుమ్మిరేవులు పంచాయతీల పరిధిలో వివిధ రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా మినుములు, రాజ్మా, సామలు పూర్తిస్థాయిలో పండిపోవడంతో రైతులు కోసి పొలాల్లో ఆరబెట్టారు. వర్షం వలన పొలాల్లో ఈ పంటలు తడిసిముద్దాయి. మినుములు, వివిధ రకాల అపరాల పంటలు వర్షాలకు మొక్కలు వచ్చి పూర్తిగా నాశనమవుతాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చే పంటలు కళ్ళముందే వర్షానికి తడిసిపోతున్న దృశ్యాలను చూసి ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో గిరి రైతులు కంటి తడపెడుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లో మినుములు, రాజ్మా ఇతర పంటలు తడిసినవే గొడుగులు వేసుకుంటూ యుద్ధ ప్రాతిపదికన కుప్పలు పెట్టి టార్పాలినట్లు వేస్తున్నారు. రెండు మూడు రోజులు ఎండ కాయకుండా వర్షం కురిస్తే కుప్పలు పెట్టిన మినుములు ముక్కుపోయి మొలకలు వచ్చే ప్రమాదముందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది మినుములు, రాజ్మా, సామలు, రాగులు ఇతర పంటలు పండడంతో కుటుంబ పోషణకు ఏడాది పొడుగునా సరిపోతాయని రైతులు భావించగా, వర్షాలు తీవ్ర నష్టం తెచ్చిపెట్టాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు జరిగిన పంటనష్టాన్ని అధికారులు అంచనా వేసి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నేడు మన్యంలో పవన్‌కల్యాణ్ పర్యటన

- పినకోటలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఉపముఖ్యమంత్రి
- పటిష్ట ఏర్పాట్లలో అధికార యంత్రాంగం



బల్లగరువులో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎస్‌పి, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పినకోట గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 21న శనివారం పర్యటించనున్నారు. దీనికి సంబంధిత ఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు.వీడకుండా కురుస్తున్న వర్షంలో సైతం చకచకా ఏర్పాటు చేస్తుండగా వాటిని జిల్లా అధికారులు పరిశీలించి తగు సూచనలు చేశారు.

పవన్‌కల్యాణ్ పర్యటనలో భాగంగా పినకొట పంచాయతీ బల్లగరువు, దాయర్తి, మద్రెబుగ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. బుధవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, గురువారం ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించగా, శుక్రవారం సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తోపాటు జిల్లా ఎస్‌పి అమిత్‌బర్ధర్ పర్యటించారు. శంకుస్థాపన ప్రాంతం, సభాప్రాంగణాలను పరిశీలించిన అధికారులు, అక్కడి ఏర్పాట్లుపై సూచనలు చేశారు. మన్యంలో పవన్‌పర్యటన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తముపై పటిష్టబందోబస్తు కల్పిస్తోంది. కాగా ఉపముఖ్యమంత్రి పర్యటనతో మారుమూల గిరిజన గ్రామాల రోడ్డుకు మంచిరోజులు రానున్నాయని గిరిజనులు ఆశాభావంతో ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు.. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పోలీసులు, ట్రాన్స్‌పోర్టు విభాగాల అధికారులతో రహదారి భద్రతా చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేస్తే రూ.500 లు జరిమానా వేయాలన్నారు. . షాపుల యజమానులు సామాన్లు రోడ్లపై పెట్టడానికి వీలులేదన్నారు. జీపులపై వేలాడుతూ ప్రయాణించకుండా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించాలన్నారు. వాహనాలకు లైసెన్సు లేకున్నా, బీమా, ఇతర పత్రాలు లేకుంటే జరిమానా వసూళ్లు చేయాలని చెప్పారు. అవసరమైతే వాహనాలు సీజ్ చేయాలని సూచించారు. వాహనాలు నడుపుతూ మృతి చెందిన వారి వివరాలపై ఆరాతీసారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, నివారణ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అరకు వ్యాలీ, అనంతగిరి మండలాల్లో ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఆ రెండు మండలాల్లో ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను, కారణాలను అడిగి తెలుసుకున్నారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జనరల్ ఆసుపత్రి సూపరింటెం డెంటు డాక్టర్ విశ్వామిత్రను ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎస్. లీలా ప్రసాద్, ఎఎంవిఐ కె.వాసు, సిఐదీనబంధు, ఆర్‌టిసి డిఎం.టి.ఉమామహేశ్వర్ రెడ్డి, పర్చువల్‌గా ప్రభుత్వ జనరల్ ఆనుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర పాల్గొన్నారు.

5 నుంచి యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- పాడేరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం (యుటిఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలో వచ్చేనెల 5,6,7,8 తేది లలో నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లు, ఆవహ్వానపత్రికలను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి నాగేశ్వరరావు, శెట్టి గంగాధర్, సీసా గోపి, గల్లెల సతీష్, కాకరి రాజారావు, ఎం. శ్రీను ఆవిష్కరించారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయలదేనని, ప్రభుత్వ విద్యా సంస్థలు ఉంటేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యా వైజ్ఞానిక రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం చేయాలని కోరారు.

ఫుడ్ సేఫ్టీకి తనిఖీలు చేపట్టాలి

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ, చిత్రంలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డిఎంహెచ్ఎం జమాల్ బాషా తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం


ఏజెన్సీలోని ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కాకుండా ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీపై శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిరాణా షాపులు, రిసార్ట్స్, హోటళ్ళు, వంటనూనె ఏజెన్సీలు, సంతల్లో తనిఖీ చేయాలని, తాగునీటి శాంపిల్స్ సేకరించి పరిశీలించాలని సూచించారు. ఫుడ్ సెక్యూరిటీపై కొంతమంది అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడి కేంద్రాలలో ఫుడ్ సెక్యూరిటీ మెథడ్స్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతినెల ఎన్ని ఫుడ్ శాంపిల్స్ తీసుకుంటున్నది, ఎక్కడెక్కడ పరిశీలిస్తున్నదీ సంబంధిత అధికారులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల ఎన్ని ఫుడ్ శాంపిల్స్ తీసుకుంటున్నారో లిస్టు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, డియంహెచ్‌ఓ జమాల్ బాషా, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గణపతి, ఫుడ్ సేఫ్టీ అధికారులు బి.వేణుగోపాల్, జిఎబి.నంద, జి.గ్రేస్ అమ్మ, యన్. పూర్ణచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల సందర్శన

రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణ శుక్రవారం మారేడుమిల్లి, వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలంతో కలిసి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పిహెచ్‌సిల్లో వైద్యాధికారులు, సిబ్బంది ఎంత మంది ఉన్నదీ, ఏయే వ్యాధులకు సంబంధించిన రోగులు వస్తున్నదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని సూచించారు. పిహెచ్‌సిల్లో అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోని అన్ని వార్డులు పరిశీలించారు. చిన్నపిల్లల న్యూట్రిషన్ హాబిటేషన్ సెంటర్ను, హెల్త్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో బ్లడ్ కొరత ఎక్కువగా ఉందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఏరియా ఆసుపత్రిలో పెద్ద రక్త పరీక్ష కేంద్రం, రెడ్ క్రాస్ వారి అనుసంధానంతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గణపతి, డియంహెచ్‌ఓ జమల్ బాషా, ఆర్‌ఎం వెంకట ఇందిరా, ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్ లక్ష్మి, ఎడియంహెచ్‌ఓ డాక్టర్ జి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలి

జిల్లా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రత్నావళి



రికార్డులు పరిశీలిస్తున్న జేడీ రత్నావళి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి, లాగరాయి, రాజవొమ్మంగి పీహెచ్సీల పరిధిలో మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని అల్లూరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రత్నావళి వైద్యాధికారులకు సూచించారు. గురువారం ఆమె మండలంలోని మూడు ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను, ప్రసూతి వార్డులను, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోజువారి ఓపి, డెలివరీలు, మందుల స్టాక్ వివరాలు, వ్యాక్సిన్, పీహెచ్సీల్లో పరికరాలు వాటి పనితీరుపై ఆరా తీశారు. పీహెచ్సీలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్సిలో నెలకొన్న పలు సమస్యలను పిహెచ్సి వైద్యాధికారులు జెడి రత్నావళి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో రాజువొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పీహెచ్సీల వైద్యాధికారులు నాగార్జున, యామిని ప్రియ, సుష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల దీక్షలు

మద్దతు తెలిపిన టిడిపి, సిపిఎం, మాలమహానాడు నేతలు



దీక్షా శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు టీచర్లుగా మార్పు చేసి 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలని, 2024 డిఎస్‌సి నుంచి తమ పోస్టులు మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఐటిడిఎ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. శుక్రవారం దీక్షా శిబిరాన్ని టిడిపి రంపచోడవరం మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మాదే రామచంద్రరావు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజన గురుకులాలను నమ్ముకొని ఏళ్ల తరబడి అతి తక్కువ వేతనాలకు తాము పని చేస్తున్నామని, ఇప్పుడు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్‌సిలో తమ పోస్టులు పెట్టడం వల్ల తాము నష్టపోతామని తెలిపారు. తమ సమస్యలపై 35 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలను ఎమ్మెల్యే శిరీష దేవి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనంత కుమారి, శామ్యూల్, సత్యనారాయణ రెడ్డి, పాపయమ్మ, తాతాజీ, విద్యార్థి సంఘాల జెఎసి గౌరవ అధ్యక్షులు ఐవి.రమణ, ఔట్సోర్సింగ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల ఔట్ సోర్సింగ్ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి : సిపిఎం

కూనవరం : గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 35 రోజులుగా గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ న్యాయబద్ధమైన డిమాండ్స్‌పై ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే జులై, ఆగస్టు నెలలో వచ్చే వరదలకు విద్యార్థులు విద్యా బోధన రెండు నెలల పాటు నష్టపోయారని తెలిపారు. వచ్చే ఫిబ్రవరి మార్చి నెలలో పరీక్షలు దగ్గర పడుతున్న వేళ ఉపాధ్యాయులు సమ్మె నేపథ్యంలో విద్యార్థులు మరింతగా చదువు నష్టపోయే ప్రమాదముందని, అందువల్ల ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బాలికల గురుకుల పాఠశాలలో వసతులు కల్పించాలి

మండలంలోని కోతులగుట్ట గురుకుల బాలికల పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని బొర్రయ్య డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో 49 బాత్రూమ్‌లు ఉండగా అందులో 12 మాత్రమే పనిచేస్తున్నాయని, ఇవి 700 మంది విద్యార్థులకు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఏడాదిగా ఇలాగే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అయినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు చొరవ చూపి తగిన వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలో. టోకురు పంచాయతీ బోరిబోరివలస. కొండిబ పంచాయతీ గొందివలస గ్రామాలకు కొత్త అంగన్వాడీలు ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని సిడిపిఓ సంతోషికుమారి తెలిపారు. ఈనెల 30 తేదీలోపు ఆ గ్రామానికి చెందిన అర్హులైన స్థానిక వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్హత, కుల, స్థానికత ఇతర ధ్రువీకరణ పత్రాలను జతపరిచి, దరఖాస్తులను తమ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు

జి.మాడుగుల : మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ సువర్ణమ్మ తెలిపారు. మండలంలో పెదవలస, గెమ్మెలిబారు, చింతలపాడు, బంగారుబూడి, కర్జాపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు పెట్టుకోవాలన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని రెండు అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు స్థానిక సిడిపిఓ దేవమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బొడ్డగండి, లోతావారివీధి గ్రామాలకు చెందిన పదవ తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్ళు దాటిన గిరిజన మహిళలు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 31 లోగా తమ తమ దరఖాస్తులను రాజవొమ్మంగి ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సిడిపిఓ దేవమణి కోరారు.

జికె.వీధి మండలంలో..

సీలేరు : జీకే వీధి మండల పరిధిలో 9 అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జీకే.వీధి ఐసిడిఎస్ సిడిపివో లక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండల పరిధిలో అరటి చెట్ల వీధి, కొత్తూరు, బొర్రా మామిడి, పిల్లి గొంది, ఈతల బంధ, కొత్తపల్లి, తీమలగుంట, నూతులు, మాలిగూడ, టంగులగొంది గ్రామాల్లో ఒక్కో అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 2024 జులై 1 నాటికి 21-35 సంవత్సరాలు మధ్య వయసు కలిగి, పదో తరగతి ఉత్తీర్ణులై, వివాహమైన స్థానిక మహిళలు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పిజిఆర్ఎస్‌లో 62 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు : స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కు 62 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, ఐటిడిఎ పిఒ. వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె. పద్మలత పాల్గొని వివిధ మండలాల నుండి అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. పెదబయలు మండలం పరేడ పంచాయతీ కొత్త చెరువు గ్రామం నుండి గ్రామస్తులు బొండా బొజ్జన్న, దొర నాగరాజు, ఎల్. రాజారావు కొత్త అంగన్వాడి భవనం మంజూరు చేయాలని కోరారు.

పెదబయలు మండలం బంగారు పంచాయతీ దోసల బంద గ్రామానికి చెందిన అరద పెంటమ్మ రేషన్ కార్డు మంజూరు చేయమని అర్జీ పెట్టారు. హుకుంపేట మండలం పాతకోట గ్రామ పంచాయతీ, పాతకోట గ్రామస్తుడు వి.అబ్బాయి పడాల్ రోడ్డు వేశారు గాని, ఇళ్లకు కొత్తగా రక్షణ గోడ నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయతీ కే. గెంజిగడ్డ గ్రామస్తులు కె. చిరంజీవి, వి. అప్పారావు, పి.సూరిబాబు త్రాగునీరు టాంకు నిర్మించమని అర్జీ పెట్టారు. హుకుంపేట మండలం తీగలవలస పంచాయితీ సరకం గ్రామస్తులు వి.సింహాచలం, వి.రాజబాబు, టి.సూరకాంత కొత్తగా స్కూల్ బిల్డింగ్ నిర్మించమని వినతిపత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం చిట్టింపాడు పంచాయతీ చిట్టింపాడు గ్రామస్తులు పి.మల్లేశ్వర రావు కొత్తగా స్మశాన ఇల్లు నిర్మించాలని అర్జీ పెట్టారు.

రెడ్‌క్రాస్ సభ్యత్వాలు చేయాలి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ మెంబర్ షిప్ అన్ని శాఖలకు డ్రైవ్ నిర్వహిస్తామని, అన్ని శాఖల హెచ్ఓడీలు బాధ్యత వహించాలని ఆదేశించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెడ్‌క్రాస్‌లో లైఫ్ టైం సభ్యత్వాన్ని రూ.1160 చెల్లించి పొందాలన్నారు. విరాళాలు ఇచ్చే వారు ముందుకు రావాలన్నారు. మండలానికి 100 మంది చొప్పున జనవరి చివరి నాటికల్లా వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రెడ్ క్రాస్ సొసైటీ సమీక్షా సమావేశము నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు ఉద్యోగులు వ్యాపారస్తుల రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించాలని అన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి జిల్లా కలెక్టరు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు.వివిధ మండలాల నుండి వచ్చిన ఉద్యోగుల నుండి 11 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సమస్య పరిష్కారానికి శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి ఎల్.రజని, వ్యవసాయ శాఖ ఎడి ఎస్బిఎస్. నంద, హౌసింగ్ డిఎం బి.బాబు, ఆర్‌టిసి డిఎం టి. మామహేశ్వర రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా సరఫరా అధికారి బి.గణేష్, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జిల్లా ఇంచార్జి టి.సుజాత, టూరిజం అధికారి జి.దాసు పాల్గొన్నారు.

కాఫీ కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కిడారి

ప్రజాశక్తి -పాడేరు : కాఫీ రైతులకు అండగా ఉంటామని రాష్ట్ర మాజీ మంత్రి, జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నంలోని జిసిసి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాఫీ రైతులు దళారుల నుండి మోసపోకుండా ఆదుకునే విధంగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాఫీ రైతుల వద్దకే వెళ్లి కాఫీ కొనాలని అధికారులను ఆదేశించామన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భవిష్యత్తులో కాఫీ రైతులకు మేలు జరిగే విధంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది 1500 టన్నుల నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాఫీ కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కిడారి శ్రావణ్ కుమార్ హెచ్చరించారు.

చినుకురాలితే జారుడుమయం!

- ఇష్టారాజ్యం పనులతో ప్రజలకు ఇక్కట్లు
- పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారులు

ప్రజాశక్తి- జి.మాడుగుల : లంబసింగి నుండి పాడేరు వరకు ఎన్‌హెచ్ 516 జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో రోడ్డు అధ్వానస్థితితో ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో రోడ్డంతా మట్టిమయం కావడంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డంతా చిత్తడిగా మారింది. ఇక ఎండ కాస్తే దుమ్ము దూళిరేగి, రోడ్డు కనబడని స్థితి ఏర్పడుతుంది. దీంతో వాహనదారులు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

ఇష్టానుసారంగా, ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా, ఎక్కడికక్కడే రహదారి తవ్వి పారేసినట్టు మట్టిని పూర్తిగా వదిలేయడం, కనీస హెచ్చరిక బోర్డులు కూడా లేకుండా కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతుండడంతో వాహనదారులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డంతా బురదమయమై ఏమాత్రం ఆదమరిచి ముందుకు సాగితే వాహనాలు జారిపోతుండగా, బైక్‌లు స్కిడ్ అయి ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని



బురదమయంగా మారిన జాతీయ రహదారి

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో జిల్లా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా, రోడ్డు అధ్వానస్థితిపై పట్టించుకోకపోవడం దారుణమని పలువురు అంటున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



చింతపల్లిలో మాట్లాడుతున్న తహశీల్దార్ రవికుమార్

ప్రజాశక్తి-చింతపల్లి: భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బి రవికుమార్ తెలిపారు శుక్రవారం మండలంలోని అంతర్ల ఎన్‌టిఆర్ రైతుసేవా కేంద్రంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పాలత అధ్యక్షత నిర్వహించిన రెవెన్యూ సదస్సుతో తహశీల్దారు పాల్గొని రైతుల నుంచి 54 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సరిహద్దులు సవరణ, పట్టాల చేర్పులు మార్పులు, కుటుంబ సభ్యులు వేరువేరుగా పట్టాలు జారీ, సర్వే నెంబర్లు మార్పులతో సమస్యలు, భూములా కబ్జా తదితర సమస్యలపై రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు చేస్తే వాటిని పరిశీలించి, న్యాయబద్ధంగా పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులందరూ సద్వినియోగం చేసుకొవాలన్నారు.కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్.విష్ణు, అరిమెల నాగబాబు, డిజిటల్ అసిస్టెంట్ బేరా సింహాచలం, విలేజ్ సర్వేయర్ దేపురం హరిప్రసాద్, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, తెదేపా నాయకుడు కోరాబు గాంధీ పడాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలపై దరఖాస్తులు పెట్టుకోవాలి

విఆర్.పురం :భూమి సంబంధిత సమస్యలపై ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు పెట్టుకోవాలని ఎంపిపి కారం లక్ష్మి, రామవరం సర్పంచ్ బుచ్చమ్మ సూచించారు. మండలం రామవరం గ్రామపంచాయతీ పరిధి శబరిరాయి గూడెం, కొప్పల్లి గ్రామాల్లో శుక్రవారం రెవిన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి, సర్పంచ్ మాట్లాడుతూ గిరిజనులు పూర్తిస్థాయి అవగాహనతో ప్రభుత్వం పథకాలతో పాటు హక్కులను సాధించుకోవాలన్నారు. రైతు సంఘం కార్యదర్శి వడ్లది రమేష్ మాట్లాడుతూ శబరిరాయి గూడెం, కోప్పల్లి గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీ కులాలకు చెందిన రైతుల సాగులో తాతల కాలం నుండి 100 ఎకరాలకుపైగా భూమి ఉందని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పోలవరం పరిహారం చెల్లింపునకు సెటిల్మెంట్ అధికారులు కొంత భూమికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారని, మొత్తం భూమికి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన తహశీల్దారు సరస్వతి మీ భూమిని ఎక్కించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి నాగరాజు, ఆర్ఐ రామకృష్ణ, కుకునూరు సుందరయ్య, కుకునూరు మురళి, తార కాంతమ్మ, కోట్ల అప్పారావు, ముత్యాల శ్రీనివాసరావు, వీఆర్వో, సర్వేయర్లు, గ్రామపంచాయతీ సెక్రటరీ తాతారావు, సచివాలయ, రెవిన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విఆర్.పురం ఎంపిపి లక్ష్మి తదితరులు

గిరిజన సమస్యలపై లోక్‌సభలో ఎంపీ ప్రస్తావన అభినందనీయం

ప్రజాశక్తి - చింతపల్లి : గిరిజన చట్టాలు, హక్కులపై లోక్‌సభలో అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ప్రస్తావించడం హర్షణీయమని ఎంపిపి కోరాబు అనూష దేవి, జెడ్‌పిటిసి సభ్యుడు భూతరాజు బాలయ్య అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ పార్లమెంటులో 47 మంది గిరిజన ఎంపీలు ఉన్నప్పటికీ అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి మాత్రమే గిరిజనుల చట్టాలు, హక్కులపై ప్రస్తావించిన తీరు ప్రత్యేకమన్నారు. గిరిజనుల కోసం పాలక పక్షాలు కొత్తగా చట్టాలేమి చేయనక్కర లేదని,రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేయకుండా చూడాలన్నారు. ఈ విషయంలో పాలక పక్షాల వైఖరిని తప్పుబట్టారు. పాలకుల వైఖరి కారణంగానే గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన 1/70, పీసా చట్టం ఉనికి కోల్పోయామని, జిఒ3 రద్దు అయ్యిందన్నారు. జిఒ 3 ప్రయోజనాలతో సరిసమానమైన ఆర్డినెన్స్ లేదా చట్టం చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షునిగా అప్పారావు



ప్రజాశక్తి- చింతపల్లి : వైసిపి ఎస్‌సి సెల్ అల్లూరి జిల్లా అధ్యక్షులుగా చిందాడ అప్పారావు నియమితులయ్యారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ఎస్‌సి సెల్ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాశ విశ్వేశ్వరరాజు, ఎంపీ తనూజ రాణి. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

విశాఖకు గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు అవసరం
గీతం సదస్సులో ఇంటాక్ కన్వీనర్

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖలో భౌగోళిక ప్రాధాన్యత గల ఎర్రమట్టి దిబ్బలు, తీరప్రాంతంలోని శిలలు, అల్లూరి జిల్లాలోని బొర్రాగుహలు, బాక్సైట్ ఖనిజం, ప్రాచీన బౌద్ధ క్షేత్రాలను యునెస్కో గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు తీసుకురావడం అవసరమని, దీనికి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) తగిన కృషి చేస్తోందని ప్రముఖ భూగర్భ శాస్త్రవేత్త, ఇంటాక్ విశాఖ కన్వీనర్ డాక్టర్ డి.రాజశేఖరరెడ్డి వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ చరిత్ర విభాగంలో శుక్రవారం నిర్వహించిన “సంస్కృతి పరిరక్షణ - సవాళ్లు, అవకాశాలు” సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాలలో ప్రస్తుతం 213 వరకు యునెస్కో గ్లోబల్ జియోపార్క్‌లు ఉన్నాయని తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాలలో ఐదు ప్రాంతాలను జియోపార్క్ గుర్తింపు పొందడానికి అర్హమైనవిగా ప్రభుత్వం గుర్తించిందని, వాటిలో విశాఖ గ్లోబల్ జియోపార్క్ ఒకటి అని తెలిపారు. యునెస్కో గుర్తింపు లభించాలంటే రెండేళ్ల ముందు నుంచి ప్రయత్నాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఈ గుర్తింపు లభిస్తే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించవచ్చని తెలిపారు. ప్రాచీన వారసత్వ ప్రాంతాలైన బౌద్ధ క్షేత్రాలు, ఎర్ర మట్టి దిబ్బలను పరిరక్షించుకోవడం స్థానిక ప్రజల భాద్యత అని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల కింద ఉండే కంబాల కొండ, ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ క్షేత్రాలు, బాక్సైట్ గనులను జియోపార్క్ మేనేజ్‌మెంట్ ఆథారిటీగా ఏర్పాటుచేసి ఉమ్మడి పర్యవేక్షణ పరిధిలోకి తేవాల్సి ఉందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అధిపతి డాక్టర్ సుష్మారాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చారిత్రక నిపుణులు రాణిశర్మ, అమెరికాకు చెందిన నేషనల్ పార్క్ నిపుణులు డేవిడ్ మాన్స్కి, ఫుల్ బ్రైట్ స్కాలర్‌లు డాక్టర్ నళిని బిక్కిన, శ్రీనివాస్ రెడ్డి, షీరాసింగర్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. గీతం చరిత్ర విభాగాధిపతి అధితి ముఖర్జి, జిసిజిసి అధిపతి కె.ఉమాదేవి, ఫైన్‌ఆర్ట్స్, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ అముక్తమాల్యద తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి రూరల్ తహిశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్‌డిఒ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సిసి కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో గాదాముల లోపల పరిస్థితిని సమీక్షించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, బద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథూర్, రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చర్యలు

ప్రజాశక్తి - సీలేరు : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై కే.రవీంద్ర హెచ్చరించారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్మలవాడలో గిరిజనులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, అక్రమ రవాణా నేరమని, అటువంటి కార్యకలాపాలకు ఎవరు పాల్పడవద్దని హితవు పలికారు. గిరిజన రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. చెడు మార్గాల వైపు వెళ్లితే జైలు పాలై కుటుంబాలకు దూరమవుతారన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే నేరుగా సీలేరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలపాలని, వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యుత్ పొదుపు వారోత్సవాలు సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు శుక్రవారం ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ కెవివి.నాగ సంతోషి, ఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజినీర్లు యమ్.దొరబాబు, షాలేము, పాఠశాల, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలపై తీసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం ఆర్‌వి.నగర్‌లో ప్రభుత్వ స్థలాల్లో గిరిజనేతరులు అక్రమంగా షాపులు నిర్మాణాలు చేసి, విక్రయాలు చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్‌వి.నగర్‌లో గిరిజనేతరులు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు ఆక్రమించి, షాపులు నిర్మాణం చేసి, లక్షల రూపాయలకు విక్రయం చేసి అధిక మొత్తంలో సొమ్ములు ఆర్జిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను ధిక్కరించి నిర్మాణాలు చేయడమే చట్ట విరుద్ధమని, అలాంటిది ఏకంగా విక్రయాలు కూడా చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనేతరులు పట్టా భూములుగా భావించి అమ్ముకోవడం ఏమిటంటే ప్రశ్నించారు. తక్షణమే జీకే తహశీల్దారు రామకృష్ణ స్పందించి క్రయవిక్రయాలపై సమగ్రమైన దర్యాప్తు చేసి అమ్మిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని, ఆయా షాపులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలుగు వాచకంలో ఉత్తరాంధ్ర అంశాల తొలగింపు తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా పరిశోధన సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి) ప్రచురించి విద్యార్థులకు అందిస్తున్న తెలుగు వాచకంలో ఉత్తరాంధ్రకు చెందిన రెండు అంశాలను తొలగించి వేరే ఒక పాఠ్యాంశాన్ని పొందుపరచడం ఎంత మాత్రమూ తగదని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ చైర్మన్ ఆచార్య కెస్.చలం తెలిపారు. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌కు ఆయన లేఖ రాశారు. ఇదిలా ఉండగా.. ఉత్తరాంధ్ర అంశాల తొలగింపుపై ఉపాధ్యాయులు, స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తొలగించిన అంశాలను తిరిగి చేర్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వెలుగు యానిమేటర్ల రిలే నిరాహార దీక్షలు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ కొనసాగింపు : సిఐటియు

ప్రజాశక్తి-రంపచోడవరం

వెలుగు యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ముందు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలుగు యానిమేటర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి అరగాటి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వెలుగు యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకమార్లు సంబంధిత అధికారులకు విన్నవించామని, ఐటీడీఏ ముందు ఆందోళనలు చేశామని, అయినా సమస్యలు పరిష్కారం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం చేసే వరకు రిలే నిరహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కలిపించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని, రాజకీయ, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహ, బసీరా, కే.సత్యవతి, యానిమేటర్లు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వెలుగు యానిమేటర్లు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక ఆటోనగర్ వద్దగల కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్ ఓవర్ బ్రిడ్జి, పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, సింగిల్ విండో క్లియరెన్స్, పిఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సమీక్షించారు.

ఘనంగా పోర్టు అంతర విభాగాల క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో 54వ అంతర విభాగాల క్రీడోత్సవాలు పోర్టు డైమండ్ జూబ్లీ స్టేడియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం పోర్ట్ స్పోర్ట్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు, పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్ కుమార్ దుబే ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిడ్, బాడీ బిల్డింగ్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ వంటివి ఉన్నాయి. పురుష, మహిళా ఉద్యోగులతో పాటు విభిన్న ప్రతిభావంతులకు పోటీలను నిర్వహిస్తున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న ఉద్యోగులంతా ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటున్నారు. ఈ క్రీడలలో విజేతలుగా నిలిచిన వారికి 2025న రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులు అందజేసి సత్కరించనున్నారు. క్రీడల ప్రారంభ కార్యక్రమంలో ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు టి.వేణుగోపాల్, ఎస్.శివ కుమార్, పలువురు విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఆ వివరాలను స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో సమావేశం జరగ్గా 71 ముఖ్య అంశాలు, 2 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 73 అంశాలను పొందుపరిచినట్టు ఆమె తెలిపారు. వాటిపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 4, 5, 26, 67 అంశాలను వాయిదా వేసినట్టు వెల్లడించారు. మిగిలిన 69 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనులకు, రెవెన్యూ అంశాలకు సంబంధించి గుత్తులు, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి అంశాలు చర్చకురాగా వాటికి సభ్యులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవారెడ్డి, 4వ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు పాల్గొన్నారు.



పీసా గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ లోతా రామారావు

ప్రశాంతంగా పీసా గ్రామసభలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని గురువారం జరిగిన పీసా గ్రామసభలు ప్రశాంతవాతావరణ నడుమ జరిగాయి. కేశవరం, పూదేడు, అమీనాబాద్, వనకరాయి, చికిలింత, కొండలింగంపర్తి, పెద్ద గర్రంగి, అనంతగిరి, దామనపాలెం, మొల్లి మెట్ల, లాగరాయి, అప్పలరాజుపేట, అప్పన్నపాలెం, శరభవరం, వనకరాయి, బలిజపాడు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో గురువారం పీసా గ్రామసభలు ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామసభల్లో పీసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. లోదొడ్డి పంచాయతీ పూదేడు, కేశవరం గ్రామాల్లో సర్పంచ్ లోతా రామారావు పీసా గ్రామసభల నేపథ్యం గిరిజనులకు వివరించారు. కేశవరం పీసా కమిటీ ఉపాధ్యక్షులుగా మేలిన రమేష్, కార్యదర్శిగా లోతా వెంకటలక్ష్మి, పూదేడు కమిటీలో ఉపాధ్యక్షులుగా వెలుసూరి సత్యనారాయణ, కార్యదర్శిగా వెలుసూరి రామలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏవో చక్రధర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : తుఫాను ప్రభావంతో ఏజెన్సీలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి చక్రధర్ రైతులకు సూచించారు. మండలంలోని వట్టిగడ్డ, రాజవొమ్మంగి, దూసరపాము తదితర శుక్రవారం ఆయన గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. మరో రెండు రోజులు వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు వరి పంట కోయకుండా ఉండాలని, కోసి నూర్చిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకుంపాలెం ఎంపీటీసీ మీనవల్లి సుబ్బారావు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధిలో రెండు రోజుల నుంచి సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు కటిక చీకట్లో రెండు రోజుల పాటు కాలం వెల్లదీసినట్లు ఆ గ్రామానికి చెందిన కిలో సన్యాసిరావు వాపోయారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందనిలైనుమెన్ బురిడి భాస్కరరావుకు సమాచారం అందిస్తే సకాలంలో స్పందించలేదని విచారం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం సాంకేతిక లోపాలు సవరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడే సాంకేతిక లోపాలు తలెత్తి తమ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, శాశ్వత మరమ్మతులు నిర్వహించే విధంగా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టాలని సన్యాసిరావు కోరారు.

కేన్సర్ ఆసుపత్రికి మల్టీపర్పస్ వెహికల్ వితరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ తన సిఎస్ఆర్ నిధులతో విశాఖలోని హోమీబాబా కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు మల్టీపర్పస్ వెహికల్‌ను విరాళంగా అందజేసింది. ఈ వాహనాన్ని హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (సిపి అండ్ పి) సిఎమ్‌డి రాకేశ్ ప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ ఉన్నతాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.